వంద పడకల ఆస్పత్రి నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కామాటిపురలో 100 పడకల ఆస్పత్రి, చార్మినార్‌లో ప్రభుత్వ నిజామియా టీబీ కాలేజీ, నిజామియా జనరల్ ఆస్పత్రిలో పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులు, కొత్త బ్లాక్‌ల నిర్మాణం, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శానిటేషన్, టాయిలెట్స్ బ్లాక్స్, యాకుత్‌పురాలోని ఎస్‌ఆర్‌టీ కాలనీలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బండ్లగూడ ఏరియా ఆస్పత్రిలో 50 పడకల ఆస్పత్రి, డబీర్‌పుర ఏరియా ఆస్పత్రిలో 100 పడకలు, బార్కాస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అప్‌గ్రేడేషన్ పనులు, లాలాపేట్ 30పడకల అర్బన్ హెల్త్ కేర్ సెంటర్, అడ్డగుట్ట 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు, నల్లకుంట ఓపీడీ బ్లాక్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ బిల్డింగ్, ఎర్రమంజిల్ ఎంసీహెచ్‌లో 200 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ ఈఎన్టీ కోఠి హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, సీతాఫల్‌మండిలో 30 పడకల అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తదితర పనుల పురోగతిపై తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజనీర్లు, డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌ఓలతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ మొదలుకాని వాటికి వెంటనే టెండర్లను పిలవాలని, నిర్మాణం మొదలైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో టీఎంఎస్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్‌రెడ్డి, ఈఈ చలపతి రావు, డీఎంహెచ్‌ఓ వెంకట్, డీసీహెచ్‌ఎస్ సునీత, టీజీ ఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.నాయుడు, డీఈ పి. జగదీష్ ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జాతీయ గణాంక దినోత్సవం

ప్రశాంత చంద్ర మహలనోబిస్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహించారు.

వీసీల నియామకాల్లో బీసీలకు 50% కేటాయించాలి


సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలకు త్వరలో చేపట్టనున్న వైస్‌చాన్స్‌లర్‌ల నియామకాల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. యూనివర్సిటీలలో 2400 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టులలో కూడా 50 శాతం పదవులు బీసీలకు కోటా ఇవ్వాలని కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.అనంతయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జేఎన్‌టీయూ, పాలమూరు, ఉస్మానియా, శాతవాహన యూనివర్సిటీ వీసీ పోస్టులను బీసీలకు కేటాయించాలని, ఉన్నత విద్యామండలి చైర్మన్ పదవిలో కూడా బీసీనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, రాజేందర్, మల్లేష్‌యాదవ్, మోదీరాందేవ్ పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో కేన్సర్‌పై సదస్సు


బసవతారకం ఆస్పత్రిలో జరిగిన సదస్సులో వైద్యులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన కేన్సర్ వ్యాధులకు మంచి చికిత్స అందించే వీలు ఏర్పడిందని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ట్రస్టు బోర్డు సభ్యులు, రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయ పేర్కొన్నారు. శనివారం బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆడిటోరియంలో కేన్సర్‌పై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నోరి దత్తాత్రేయ, బసవతారకం ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కృష్ణయ్య మాట్లాడారు. సార్కోమా అనే ఎముకలు, మృదు కణజాలాలలో కొవ్వు, కండరాలు, రక్త నాళాలు, నరాలు, లోతైన చర్మ కణజాలాలు, పీచు కణజాలాలలో అభివృద్ధి చెందే అరుదైన కేన్సర్‌పై అవగాహన కలిగించడం, వ్యాధిని గుర్తించడం, ఎలాంటి చికిత్స అందించాలనే అంశాలపై ఈ సదస్సులో నిపుణులు చర్చించారు. మెడికల్ డైరెక్టర్, డాక్టర్ టీఎస్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఫణికోటేశ్వరరావు, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్, చెన్నైకి చెందిన ప్రముఖ మస్కిలోస్కెలిటన్ అంకో సర్జన్ డాక్టర్ ఆనంద రాజాతో పాటూ వైద్యులు శ్రీనాథ్‌గుప్తా, డాక్టర్ సృజన్ శుక్లా వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు


దగ్గుపాటి సురేష్‌బాబుకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దుండిగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణీకరణ సంస్థ నుంచి ఐఎస్ఓ 2001, 2018 ప్రమాణపత్రం లభించింది. శనివారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్‌బాబు మాట్లాడుతూ పాఠ్యాంశాల రూపకల్పన, విద్యార్థులకు అనుకూలమైన విద్యాబోధనా పద్ధతులు, మంచి వనరులు, వసతుల కల్పన, ఆహ్లాదకరమైన వాతావరణం వంటివి విద్యా సంస్థలో ఉన్నందున ఈ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన అధ్యాపకులు ఆచార్య సీడీ నాయుడు, పరిపాలనా డీన్ ఆచార్య డాక్టర్ చెన్నకేశవరావు, సమన్వయ కర్త డాక్టర్ డీవీ చంద్రమోహన్‌రావు పాల్గొన్నారు.

‘పీఎం సూర్యఘర్- ముఫ్త్ బిజిలీ యోజన పోర్టల్ సమస్యలు పరిష్కరించాలి’

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్- ముఫ్త్ బిజిలీ యోజన పథకం పోర్టల్‌లో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.అశోక్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.శ్రీహరిబాబు డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో శనివారం తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ పథకం కింద అపార్ట్‌మెంట్లు, సొసైటీలలో సోలార్ ఎనర్జీ స్థాపన కోసం ఉద్దేశించిన దరఖాస్తులను పోర్టల్ అంగీకరించడం లేదన్నారు. సాధారణంగా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు డిస్కంలకు చెందిన ఏడీఈల లాగిన్‌లోకి రావాలి కానీ, అలా జరగడం లేదన్నారు. పోర్టల్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం, డిస్కంలు ప్రత్యేక దృష్టిసారిస్తే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశముంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పరకాల రాజేష్, బాబునాయుడు పాల్గొన్నారు.

కల్కిని వీక్షించిన దర్శక, నిర్మాతలు

చిక్కడపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అమితాబ్‌బచ్చన్, దీపికా పడుకోన్, ప్రభాస్ నటించిన కల్కి సినిమాను ఆ సినిమా దర్శక, నిర్మాతలు వీక్షించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సుదర్శన్ 35ఎంఎం థియేటర్‌లో శుక్రవారం రాత్రి 10గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు మొత్తం సినిమాను సినిమా దర్శక నిర్మాతలు నాగ్‌అశ్విన్, స్వప్నదత్, ప్రేక్షకులతో కలిసి చూశారు. థియేటర్ మేనేజింగ్ పార్ట్‌నర్‌లు విశ్వంబర్, బాల్‌గోవింద్‌రాజు, మేనేజర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్ వారి వెంట ఉన్నారు.



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి హైదరాబాద్ నార్సింగ్ సర్వీస్ రోడ్డులోని జయభేరి టెంపుల్ వీధికి చెందిన మాగంటి సత్యనారాయణమూర్తి, మధురావు కుటుంబసభ్యులు శనివారం రూ.40 లక్షలకు పైగా విలువగల బంగారు తాపడంతో చేసిన ఆభరణాలను సమర్పించారు. నాగాభరణం, జరాఝూటం, నాగపడగ, పానమట్టం, ధారపాత్ర, మకర తోరణం తదితర ఆభరణాలను ఈవో కేఎస్ రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు.

- విజయవాడ(వన్‌టౌన్), జూన్ 29(ఆంధ్రజ్యోతి)

బోయిన్ చెరువును ముంచెత్తిన గుర్రపుడెక్క


బోయిన్ చెరువులో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క

- వెలువడుతోన్న దుర్వాసన
- దోమల స్వైరవిహారం
- కానరాని లేక్ ప్రొటెక్షన్ సిబ్బంది


చెరువులో స్థానికులు వేసిన చెత్తా చెదారం

ఓల్డుబోయినపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధిలోని బోయిన్ చెరువు గుర్రపుడెక్కతో నిండిపోయింది. స్థానికులు చెరువు చుట్టుపక్కల చెత్తా చెదారం వేయడంతో పాటు కాలనీ మురుగు నీరు సైతం చెరువులోకి వచ్చి చేరుతోంది. ఫలితంగా చెరువునీరు తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీటి కారణంగా విపరీతంగా దోమలు వృద్ధి చెంది సమీప కాలనీలను చుట్టుముడుతున్నాయి. దోమల కారణంగా రోగాల బారిన పడుతున్నామని సమీప కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువును అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్ది ఆహ్లాదకరంగా మారుస్తామని చెప్పిన ప్రజాప్రతినిధుల హామీలు నీటి మూటలుగానే మిగిలాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలం అంటే వ్యాధులు ప్రబలే సమయం. ఈ సమయంలో చెరువు నుంచి వెలువడుతున్న దుర్వాసన, దోమల కారణంగా ఓల్డుబోయినపల్లి వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువులో గుర్రెపు డెక్కను తొలగించకపోగా చెరువు పరిసరాలను కూడా పట్టించుకోవడం లేదని, దీంతో చెరువు పరిసరాలు మురికి కూపాల్లా మారాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులతో వచ్చి మొక్కుబడిగా చెరువును సందర్శించి వెళ్తున్నారే తప్పా ఎలాంటి పనులు చేయడం లేదని చెరువు చుట్టు ఉన్న అంజయ్యనగర్, హస్మత్‌పేట, ముస్లింబస్తీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికే చాలా మంది మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలతో ఆసుపత్రిలో చేరారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

మొద్దునిద్రలో లేక్ ప్రొటెక్షన్ సిబ్బంది

చెరువులో చెత్తా చెదారం వేయకుండా, చెరువు ఆక్రమణకు గురి కాకుండా ఉండేందుకు లేక్ ప్రొటెక్షన్ సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. షిఫ్టుకు ఇద్దరు చొప్పున రోజుకు ఆరుగురు పని చేస్తుండాలి. కానీ వారు ఏం చేస్తున్నారో తెలియడం లేదు. చెరువు ఆస్తులను కాపాడడం, చెరువు వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా చూడాల్సిన లేక్ ప్రొటెక్షన్ సిబ్బంది ఏ రోజూ కనిపించడం లేదు.

ఎంటమాలజీ విభాగంలో సిబ్బంది కొరత

చెరువుల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉండేలా చూడడం, వీధుల్లో ఫాగింగ్ తదితర పనులు చేసేందుకు కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో సరైన సిబ్బంది లేదని తెలుస్తోంది. డివిజన్‌కు 18 మంది సిబ్బంది 1 ఒక సూపర్‌వైజర్ పని చేయాల్సి ఉండగా రెండు డివిజన్‌లకు కలిపి ఒక సూపర్‌వైజర్, 8 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అరకొర సిబ్బందితో పనులు ఎలా చేస్తారని స్థానిక నేతలు ప్రశ్నిస్తున్నారు. 12 సంవత్సరాల నుంచి సిబ్బందిని పెంచకుండా ఉన్నవారితోనే నెట్టుకురావడంతో ఈ సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది.

గుర్రపు డెక్కను తీసేందుకు ట్రాస్ కలెక్టింగ్ మిషన్

చెరువులో విపరీతంగా పెరిగిన గుర్రపుడెక్కను తొలగించడానికి ఇటాచి, ఎక్స్‌కమేటర్‌లను ఉపయోగిస్తుంటారు. అయితే బోయిన్ చెరువులోకి ఈ మిషన్లు దిగడానికి, పని పూర్తి చేసుకుని వెనక్కి రావడానికి దారి లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. అందుకే చెరువులోని గుర్రపు డెక్కను తీసేందుకు వాకింగ్ ట్రాక్ మార్గాలు కూడా పనికి రాకపోవడంతో ట్రాష్ కలెక్షన్ మిషన్ ద్వారా గుర్రపు డెక్కను తొలగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

> **ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్షన్ మిషన్ కోసం లెటర్ పెట్టాం**
>
> బోయిన్ చెరువులో గుర్రపు డెక్కను సిబ్బంది లేదా హిటాచీ మిషన్ల ద్వారా తొలగించడానికి వీలులేదు. అందుకే గుర్రపు డెక్కను తొలగించడంలో జాప్యం జరుగుతోంది. గుర్రపు డెక్కను తొలగించేందుకు ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్షన్ మిషన్ కావాలని జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు లెటర్ పెట్టాం. మిషన్ రాగానే పనులు మొదలుపెడతాం. ఎంటమాలజీ విభాగంలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ చెరువుల్లో, వీధుల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు బాల్స్, ఫాగింగ్ చేయిస్తున్నాం.
>
> - ఉషారాణి, ఏఈ కూకట్‌పల్లి ఎంటమాలజీ విభాగం

నాలాలపై ఆక్రమణలను తొలగించాలి

జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి


కొండాపూర్‌లో రోడ్డుపై నీరు నిల్వఉండే ప్రాంతాలను పరిశీలిస్తున్న జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి, అధికారులు

గచ్చిబౌలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో నాలాల ఆక్రమణ జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని వెంటనే తొలగించాలని ఆక్రమణదారులను జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి హెచ్చరించారు. వరదనీటి ప్రవాహానికి కీలకమైన నాలాలు ఆక్రమణలు జరిగితే కూల్చివేయాలని ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగం, పారిశుధ్య విభాగం అధికారులను ఆయన ఆదేశించారు. శనివారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం చందానగర్ సర్కిల్ పరిధిలోని నాలాలను ఆయన పరిశీలించారు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం. కొత్తగూడ అండర్ పాస్, మాదాపూర్ వంద అడుగుల రోడ్డు, అండర్‌పాస్, మియాపూర్ హెచ్‌డీఎఫ్ బ్యాంకు రోడ్డు, నడిగడ్డతండా ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారులపై నిలుస్తున్న వర్షపునీటిని గుర్తించారు. రోడ్లపై వరదనీరు నిలిచిట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

- **పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి**

శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలంలో పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. వ్యర్థాల నిర్వహణ, చెత్తనిర్మూలన అంశాలపై అధికారులతో జడ్సీ చర్చించారు.

- శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్‌సీతో సమావేశమై డివిజన్ పరిధిలోని నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, కేశవనగర్, గోపన్‌పల్లి, నల్లండ్ల హుడాకాలనీలో భూగర్భడ్రైనేజీ, సీసీరోడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యను ఆయనకు వివరించి పరిష్కరించాలని కార్పొరేటర్ కోరారు.


బాలాజీనగర్ వార్డు కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే కృష్ణారావు

అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు

- **ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కూకట్‌పల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, తద్వారా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు స్పందించకపోవడంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలాజీనగర్‌లోని వార్డు కార్యాలయంలో శనివారం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న పార్కుల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలోని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తరుచూ నాలాలు పొంగిపొర్లుతున్నాయని తెలిపారు. అధికారులు యుద్ధప్రాతిపదికన డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శిరీష, అధికారులు రమేష్, సత్యనారాయణ, జలమండలి, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిర్యానీలో హెయిర్‌పిన్

మణికొండ మెహిఫిల్ హోటల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన నటుడు అనిరుధ్

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన చికెన్ బిర్యానీలో హెయిర్ పిన్ వచ్చిన సంఘటన కస్టమర్‌ను షాక్‌కు గురిచేసింది. నటుడు అనిరుధ్ మణికొండ మెహిఫిల్ హోటల్ నుంచి చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశాడు. బిర్యానీ పార్సిల్‌లో హెయిర్‌పిన్ రావడంతో ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. హోటల్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, హోటల్‌పై చర్యలు తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ, జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు హైదరాబాద్ పోలీసులకు ట్యాగ్ చేశాడు. దీనిపై వెంటనే స్పందించిన హైదరాబాద్ పోలీసులు హోటల్ ఉండే ప్రాంతం తమ పరిధిలోకి రాదని, సైబరాబాద్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. దీనిపై స్పందించిన నటుడు అనిరుద్ హైదరాబాద్ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

పబ్‌లలో తరుచూ తనిఖీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు సమాచారం వచ్చిన పబ్బుల్లో డ్రగ్ టెస్ట్ కిట్‌లతో పరీక్షలు నిర్వహించి, డ్రగ్స్ వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని మాదాపూర్ డీసీపీ జి.వినీత్ హెచ్చరించారు. కళాశాలల్లో డ్రగ్స్ విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గచ్చిబౌలి డీసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అరెస్టయిన డ్రగ్ పెడ్లర్లు, వినియోగదారుల వివరాలు వెల్లడించారు. దూద్‌బౌలికి చెందిన మోతిక్ సచ్చిదానంద్ అలియాస్ సచిన్(28) గంజాయి విక్రేత. అతడి నుంచి కురుమతోత్ రాథోడ్ నవీన్‌నాయక్, ప్రణీత్‌రెడ్డి, రాహుల్‌రాజ్ గంజాయి కొనుగోలు చేస్తున్నారు. పక్కా సమాచారంతో టీఎస్ న్యాబ్, మాదాపూర్ పోలీసులు నలుగురిని హైటెక్స్ కమాన్ వద్ద అరెస్ట్ చేసి, 1.50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కురుమతోత్ రాథోడ్ నవీన్‌నాయక్‌పై రెండు ఎన్‌డీపీఎస్ కేసులున్నట్లు గుర్తించామని తెలిపారు. తిరుచానపల్లి ఎన్ఐటీలో బీటెక్‌లో చేరిన నవీన్‌నాయక్, స్నేహితులతో కలిసి డ్రగ్స్ అలవాటు చేసుకున్నాడు. చదువు మానేసి డ్రగ్స్ విక్రయాలు ప్రారంభించాడు. పరారీలో ఉన్న నవీన్‌నాయక్ నగరానికి వచ్చినట్లు తెలియడంతో అరెస్ట్ చేశామన్నారు. గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నీతూబాయ్‌పై పీడీయాక్ట్ ప్రయోగించామని, గంజాయి ద్వారా ఆమె సంపాదించిన ఆస్తులను అటాచ్ చేశామని డీసీపీ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ కృషి


మూసాపేట ఆంజనేయనగర్‌లో పర్యటిస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మూసాపేట సమీపంలోని ఆంజనేయనగర్, గూడ్‌షెడ్ రోడ్డు, మూసాపేట ప్రాంతాల్లో శనివారం పర్యటించిన ప్రజల సమస్యలను పరిశీలించారు. ముఖ్యంగా రోడ్డు, డ్రైనేజీ, పార్కులను అభివృద్ధి చేయాలంటూ కాలనీవాసులు బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. నాగిరెడ్డి, తూము వేణు, చున్నుపాషా, కేబుల్ శ్రీను, నయూమ్, రమణమూర్తి, చక్రధర్, హనుమంతరావు, లోకేష్, హర్ష, దీపక్, రమేష్ పాల్గొన్నారు.

- నీట్ పరీక్ష నిర్వహించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో నిర్వహించిన ఆందోళన ఆయన పాల్గొని మాట్లాడారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీతో దేశానికే చెడ్డ పేరు తెచ్చారని ఆరోపించారు.

సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలి

అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వరదలు, ముంపు ప్రాంత ప్రజల సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలని అధికారులకు అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డి సూచించారు. గచ్చిబౌలిలోని ‘అగ్ని భవన్’లో శనివారం జిల్లా అగ్నిమాపక శాఖ, ఆ పైస్థాయి అధికారులతో డీజీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జూలైలో వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో వరదలు, ముంపులో చిక్కుకునే లోతట్టు ప్రాంత ప్రజల్ని రక్షించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సహాయ, రక్షణ చర్యలకు అవసరమైన పరికరాలన్నింటిని ఎళ్లవేళలా సిద్ధంగా ఉంచాలని డీఎఫ్ఓలకు స్పష్టం చేశారు. వాహనాలు, ఇతర పరికరాలు పనితీరును ముందుగానే సరిచూసుకోవాలని అధికారులకు డీజీ నాగిరెడ్డి సూచించారు.

మాజీ మంత్రి డి.శ్రీనివాస్‌కు నివాళి


కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు వద్ద శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గాలి బాలాజీ, కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి డి.శ్రీనివాస్ సేవలు మరువలేనివని టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ అన్నారు. ఆయన అనారోగ్యంతో మృతి చెందడంతో కేపీహెచ్‌బీకాలనీలోని టెంపుల్ బస్టాపు వద్ద శనివారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మంత్రిగా డి.శ్రీనివాస్ అనేక సేవలందించారన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, పొడుగు అప్పారావు, ఫణీంద్ర, రంగస్వామి, పి.ఆర్.నాయుడు, రామారావు, గోపాల్‌చౌదరి, సాయి, పొన్నం రజిత, రేష్మ, దివ్య, భాగ్య పాల్గొన్నారు.


సోమశ్రీ కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ జ్యోతి

కుక్కకాటు బాధితురాలికి ఆర్థిక సాయం

నిజాంపేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కుక్కకాటుకు గురైన బాలికకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ 25 వేల రూపాయల ఆర్థిక సాయం శనివారం అందజేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ 27వ వార్డు బండారి లేఅవుట్‌కు చెందిన శ్రీకాంత్ నాగసాయిల దంపతుల కుమార్తె సోమశ్రీ కుక్కకాటుకు గురయింది. నిరుపేద కుటుంబం కావడంతో కార్పొరేటర్ జ్యోతి ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది. సోమశ్రీ కుటుంబసభ్యులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.25 వేలు కార్పొరేటర్ చేతులమీదుగా బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంతారావ్, విజయవీరభద్రబాబు, రోజా, రవి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

షూటింగ్‌లో కానిస్టేబుల్ ప్రతిభ


రాజ్‌కుమార్‌ను అభినందిస్తున్న కమాండెంట్ సన్ని

గచ్చిబౌలి:కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోన్న రాజ్‌కుమార్ ఇటీవల జరిగిన 10వ తెలంగాణ స్టేట్ షూటింగ్ పోటీల్లో 50ఎంఐలో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. దీంతో కమాండెంట్ సి.సన్ని రాజేష్‌ను సన్మానించాడు.

- 8వ బెటాలియన్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఆర్ఐ ఎస్ఐ సత్తార్, నందన్ శివరామ్, నారాయణను కమాండెంట్ సన్ని సన్మానించారు. అడిషనల్ కమాండెంట్ బీవీ రెడ్డి, సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు రాంబాబు, రెహమాన్, పార్థసారథి, సీతారాం, అధికారులు పాల్గొన్నారు.

బస్తీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి, కేశవనగర్ బస్తీ బస్తీవాసులతో కలిసి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి శనివారం పాదయాత్ర చేసి సమస్యలు పరిశీలించారు. బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు, శ్మశానవాటిక పనులు త్వరలో పూర్తి చేయిస్తామన్నారు.


లులు మాల్‌లో భద్రతా ప్రమాణాలపై కేపీహెచ్‌బీ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శనివారం రాత్రి మాల్‌లోకి వ్యక్తుల ఎంట్రీ సమయంలో తనిఖీలు చేస్తున్న తీరు, వాహనాల చెకింగ్ గురించి మాల్ భద్రతా సిబ్బందికి సూచనలు చేశారు.
- కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)


బీజేపీ అభిమాని, పొలిటికల్ సర్వే సంస్థ అధినేత, హిల్‌కౌంటీకి చెందిన ప్రదీప్‌వర్మ మృతి చెందిన సమాచారం తెలుసుకొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నిజాంపేట్‌లోని ప్రదీప్‌వర్మ నివాసానికి శనివారం వచ్చి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు.
- నిజాంపేట్, (ఆంధ్రజ్యోతి)


శేరిలింగంపల్లి నియోజకవర్గం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేటరోడ్డుకు చెందిన వెంకట నరేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా విడుదలైన రూ.50 వేల చెక్కును ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సప్తగిరికాలనీలోని తన నివాసంలో శనివారం అందజేశారు.
- వివేకానందనగర్‌కాలనీ, ఆంధ్రజ్యోతి